కార్తీక మాసం



రామలింగేశ్వర స్వామికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకుడు

హరహర మహాదేవ శంభో శంకర

• భక్తులతో పోటెత్తిన శైవక్షేత్రాలు • ఆలయాల్లో కార్తీక దీపాలు వెలిగించిన భక్తులు

చివరి సోమవారం



న్యూరామాలయం ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

నల్లకుంట: కార్తీక మాసం చివరి సోమవారం (నాల్గో) అంబర్‌పేట, ముషీరాబాద్ నియోజకవర్గాల్లోని శైవక్షేత్రాలు శివ నామస్మరణతో మార్మోగాయి. బియ్యపు పిండి, ఉసిరి, నిమ్మ, మట్టి ప్రమిదల్లో నెయ్యి, నూనె పోసి దీపారాధన చేశారు. దీపాల వెలుగులో ఆలయాలు కాంతులీనాయి. ఈ సందర్భంగా న్యూ నల్లకుంటలోని శ్రీ సీతారామాంజనేయ సరస్వతి దేవాలయం(న్యూరామాలయం)లోని పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో అర్చకస్వామి జ్ఞానేశ్వర్ మంత్రోచ్చరణల నడుమ శివుడికి పంచామృత, క్షీర, పంచదారాభిషేకం కావించారు. అనంతరం పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు కావించి హారతులు ఇచ్చారు. ఈ సందర్భంగా మహిళలు ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాద వితరణ జరిగింది.

రేపు సహస్ర లింగాకార దీపాలంకరణ..

కార్తీక మాసాన్ని పురస్కరించుకొని బుధవారం (రేపు) సాయంత్రం 6 గంటలకు న్యూ రామాలయం ప్రాంగణంలో సహస్ర లింగాకార దీపాలంకరణ ఉంటుందని ఆలయ పాలక మండలి చైర్మన్ జమలాపురం గోపాల్‌రావు తెలిపారు. దీపాలంకరణలో పాల్గొనాలనుకునే భక్తులు వివరాల కోసం ఆలయ గుమస్తా, ఆలయ అర్చకుడిని సంప్రదించాలని కోరారు.

శంకరమఠంలో ప్రత్యేక పూజలు..

నల్లకుంట శంకరమఠం ప్రాంగణంలోని చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో శివుడికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు కావించారు. అంతకు ముందు శక్తి గణపతికి ఆది పూజలు కావించి, శారదాంబకు విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ, ప్రసాద వితరణ చేశారు. అలాగే శివం రోడ్డులోని లింగాల గడ్డ శివాలయంలో, న్యూనల్లకుంటలోని బీరప్ప దేవాలయంలో శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాద వితరణ జరిగింది.



భోలక్‌పూర్ భవానీశంకర దేవాలయంలో దీపాలను వెలిగిస్తున్న భక్తులు

దేవుని తోటలోని భవానీశంకర ఆలయంలో..

ముషీరాబాద్: కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో ముషీరాబాద్‌లోని శైవక్షేత్రాలు తెల్లవారుజాము నుంచే భక్తులతో కిటకిటలాడాయి. భోలక్‌పూర్ దేవుని తోటలోని 400 సంవత్సరాల చరిత్రగల భవానీ శంకర దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి దీపాలు వెలిగించారు. స్వామివారికి పుష్పార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఈవో జ్యోతి, ఆలయ మాజీ చైర్మన్ ఆర్.శ్రీనివాస్ పాల్గొన్నారు. ముషీరాబాద్ మహంకాళీ దేవాలయంలో భక్తులు కార్తీకదీపాలను వెలిగించారు. ఆలయ ప్రధాన అర్చకులు వై.చంద్రమౌళి, దేవాదయ శాఖ ఈవో మహేందర్‌కుమార్‌లు పాల్గొన్నారు.



శివయ్య పూజలో పాల్గొన్న భక్తులు

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏరపడుతుందని ఏడీఈ జి.నాగేశ్వర్ రావు తెలిపారు.

◆ గోల్కొండ క్రాస్‌రోడ్ ఫీడర్ పరిధిలోని ఏక్‌మినార్‌మసీద్, కృష్ణాకాలనీ, శివాలయం టెంపుల్, ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ తదితర ప్రాంతాలలో ఉదయం 10గంటల నుంచి ఒంటి గంట వరకు...

◆ స్పెన్సర్ ఫీడర్ పరిధిలోని రాజాడీలక్స్, రేస్‌కోర్సు, చర్చి గల్లీ, ఎన్‌బికే ఎస్టేట్ తదితర ప్రాంతాలలో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు..

◆ దాయారం మార్కెట్ ఫీడర్ పరిధిలోని రిసాలా, సాగర్‌లాల్ హాస్పిటల్, హరినగర్ తదితర ప్రాంతాలలో మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు..

◆ శాస్త్రీనగర్ ఫీడర్ పరిధిలోని జమిస్తాన్‌పూర్, శాస్త్రీనగర్, మోహన్‌నగర్, రాంనగర్, జెమినీకాలనీ, సెయింట్ పాయిస్ స్కూల్ తదితర ప్రాంతాలలో మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నేడు 'రాజ్యాంగ దినోత్సవం.. మైనార్టీల హక్కుల సాధన'పై సదస్సు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ''రాజ్యాంగ దినోత్సవం.. మైనార్టీల హక్కుల సాధన''అనే అంశంపై ఈనెల 26వ తేదీన సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు క్రైస్తవ ప్రజాస్వామ్య ఉద్యమం ఫౌండర్ ప్రెసిడెంట్ పీపీ మొల్కిసేదిక్ తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథులుగా ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ పర్యవేక్షకులు డాక్టర్ ఎస్తర్ రాణి, సీపీఐ(ఎం) రాష్ట్ర సెక్రటేరియట్ మెంబర్ ఎండీ అబ్బాస్, సీపీఐ స్టేట్ కౌన్సిల్ మెంబర్ యేసు రత్నం , ఆంధ్ర క్రిస్టియన్ జియాలజికల్ కాలేజ్ ప్రిన్సిపల్ జి. వరప్రసాద రావు, ఇంటర్నేషనల్ క్రిస్టియన్ లాయర్స్ అసోసియేషన్ అడ్వకేట్ మెంబర్ లీగల్ అడ్వైజర్ సాల్మన్‌రాజు తదితరులు హాజరవుతారని తెలిపారు.

నేటి నుంచి కుటుంబ సర్వే ఎంట్రీ

చాదర్‌ఘాట్: 20 రోజుల నుంచి జరుగుతున్న కుటుంబ సమగ్ర సర్వే వివరాలను మంగళవారం నుంచి కంప్యూటర్లలో ఎంట్రీ జరుపుతున్నట్లు మలక్‌పేట సర్కిల్–6 డీసీ జయంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 60 మంది ఆపరేటర్లతో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు డేటా ఎంట్రీ కొనసాగుతుందని తెలిపారు. ఇప్పటి వరకు 82 శాతం పూర్తయినట్లు తెలిపారు. ఎంట్రీ ఆపరేటర్లు తప్పుడు ఎంట్రీలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సూపర్‌వైజర్లు సాబేర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దళిత సంక్షేమానికి ప్రభుత్వం ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేదు

ఆర్‌పీఐ గ్రేటర్ అధ్యక్షుడు జేఎల్ సుదేష్‌కుమార్

కాచిగూడ: రాష్ట్రంలో దళితుల సంక్షేమానికి సంబంధించి నిర్ణయాలు తీసుకున్న తర్వాతే ప్రజాపాలన విజయోత్సవాలు జరుపుకోవాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పీఐ) గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు జేఎల్ సుదేష్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం బర్కత్‌పురలో ఆయన మాట్లాడుతూ... పరిశ్రమల శాఖలో దళితులకు సంబంధించిన రూ.1100 కోట్ల సబ్సిడీలు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. దీని వల్ల దళిత పారిశ్రామికవేత్తలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. మూడేళ్ల నుంచి అంబేడ్కర్ విదేశీ విద్యానిధి పథకానికి సంబంధించిన నిధులు విడుదల చేయడం లేదన్నారు. ఎస్సీ కార్పొరేషన్ రుణాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నప్పటికీ ఇప్పటి వరకు దళితుల సంక్షేమానికి సంబంధించి ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేదని పేర్కొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన అవసరం

యాకుత్‌పురా: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ సూచించారు. చార్మినార్ మండల పరిధిలో మంజూరైన 240 షాదీముబారక్ చెక్కులను సోమవారం యాకుత్‌పురాలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన కార్పొరేటర్లు, తహసీల్దార్‌తో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పథకలపై ప్రజలకు అవగాహన ఎంతో అవసరమన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి

లిబర్టీ: రాజ్యాంగ సవరణ చేసి అణగారిన మాదిగలకు న్యాయం చేయాలని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు కే.బీ.శ్రీధర్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 341 ఆర్టికల్‌ను సవరించాలని దండోరా ధర్మ పోరాటం పేరుతో పోకల కిరణ్ మాదిగ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షకు ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని సవరించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వర్గీకరణ అంశానికి ఆర్టికల్ 341 ఇబ్బంది కలిగించే విధంగా ఉందని, ఆ ఆర్టికల్ సవరించాలని విన్నవించారు. సామాజిక న్యాయం, రిజర్వేషన్ల వర్గీకరణ కోసం పోరాటం చేస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

అయ్యప్ప స్వాములకు నిత్యాన్నదానం

అఫ్జల్‌గంజ్: భాగ్యనగర్ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో నిత్యాన్నదాన కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. మధ్యాహ్నం అన్నదానం, రాత్రి అల్పాహార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సమితి అధ్యక్షుడు క్యాతం రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి, మేడిశెట్టి రాకేష్, కోశాధికారి, సీఏ అనిల్‌నాయర్ పేర్కొన్నారు. ఈ మేరకు ఉస్మాన్‌గంజ్‌లోని సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన వివరాలను వెల్లడించారు. సమావేశంలో క్యాతం రాధాకృష్ణ మాట్లాడుతూ.. బాస్ ఆధ్వర్యంలో 16 ఏళ్లుగా అయ్యప్ప మాల దీక్ష ధరించిన అయ్యప్ప స్వాములకు 41 రోజుల పాటు అన్నదానం, అల్పాహారం విజయవంతంగా కొనసాగిస్తూ వస్తున్నామన్నారు.త్వరలో ఎగ్జిబిషన్ మైదానంలో కూడా భారీ ఎత్తున అయ్యప్ప మహా పడిపూజ సైతం నిర్వహిస్తామని రాధాకృష్ణ తెలిపారు.

పేట్ల బురుజులో ఎన్సీడీ క్లినిక్ ప్రారంభం

చార్మినార్/దూద్‌బౌలి: పేట్లబురుజు ఆధునిక ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో ఎన్సీడీ(నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్) క్లినిక్‌ను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రజినిరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ క్లినిక్ గర్భిణులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆమె తెలిపారు. దీంతో పాటు కేన్సర్ స్క్రీనింగ్, గర్భిణులకు రక్తహీనత, బీపీ, షుగర్‌తో పాటు అన్ని రకాల శస్త్ర చికిత్సలు అందుబాటులో ఉన్నాయన్నారు. గత నెల అక్టోబర్‌లో సిజేరిస్ ద్వారా 542 ప్రసవాలు, మేజర్ ఆపరేషన్ ద్వారా 631 మైనర్ ప్రసవాలు, 381 డీపీఎల్‌ఎస్, 210 ప్రసవాలు జరిగాయని ఆమె వివరించారు. వివిధ జిల్లాల నుంచి ఆసుపత్రికి వచ్చే గర్భిణులకు ఎలాంటి సమస్యలు రాకుండా 24 గంటలు అందుబాటులో ఉండి వారికి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. రోగులతో పాటు వారి సహాయకుల వద్ద నుంచి ఆసుపత్రి సిబ్బంది అక్రమంగా డబ్బులు వసూలు చేస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలి

ముషీరాబాద్: సీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి చట్టసభల్లో బీసీలకు దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుపల్లి కృష్ణాయాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఎన్నికల ప్రచారంలో బీసీల ఓట్లే లక్ష్యంగా ప్రచారం చేసుకున్న ప్రధాని మోదీ జనాభా లెక్కల్లో బీసీ కులగణన చేపడతానని ఇచ్చిన హామీని విస్మరించారని విమర్శించారు. అలాగే కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, జనవరి నుంచి ప్రారంభం అయ్యే దేశ జనాభా గణనలో బీసీల కులాల గణన చేపట్టాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో క్రిమిలేయర్ విధానాన్ని ఎత్తి వేయాలన్నారు. బీసీ అట్రాసిటీ చట్టం ఏర్పాటు చేసి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షులు బూర్గుపల్లి కృష్ణాయాదవ్

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి సంకల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం సహకరించాలన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల అమలును దేశవ్యాప్తంగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు గొరిగే మల్లేష్‌యాదవ్, నిఖిల్, వెంకటరాములు తదితరులు పాల్గొన్నారు.

మత విద్వేషాలు అత్యంత ప్రమాదకరం



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న కోవా డైరెక్టర్ మజార్ హుస్సేన్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: మత విద్వేశాలు అత్యంత ప్రమాదకరమని వామపక్ష నేతలు అన్నారు. మతవిద్వేషాలను రెచ్చగొడుతూ పబ్బం గడుపుకునే పార్టీల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ''మతోన్మాద విద్వేష శక్తుల నుంచి హైదరాబాద్‌ను కాపాడుకుందాం''అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కోవా డైరెక్టర్ మజార్ హుస్సేన్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటీ నర్సింహ, మాస్‌లైన్ నగర కార్యదర్శి హన్మేష్ తదితరులు పాల్గొని మాట్లాడారు. హైదరాబాద్ నగరంలో గుడులపై జరిగిన దుర్ఘటనలను ఆధారం చేసుకుని రాజకీయ పబ్బం గడుపుకునేందుకు బీజేపీ ప్రయత్నం చేస్తోందన్నారు. మతవిద్వేషాలను రెచ్చగొడుతూ... అల్లర్లు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని వారు విమర్శించారు. ఈ మతవిద్వేషాలు నగర భవిష్యత్‌కు అత్యంత ప్రమాదకరమని అన్నారు. రాజ్యాంగ మౌళిక సూత్రాలైన సెక్యులరిజాన్ని దెబ్బతీసే చర్యలకు బీజేపీ పాల్పడుతోందని విమర్శించారు. సీపీఎం నగర కార్యదర్శి ఎం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ నాయకులు ఝాన్సీ, శివబాబు, జానీబాషా, బి. సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలి

గౌలిపురా: వైద్య ఆరోగ్య శాఖలో 2000 సంవత్సరం నుంచి కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న ఏఎన్‌ఎంలను ఎలాంటి రాత పరీక్ష లేకుండా రెగ్యులరైజ్ చేయాలని వైద్య ఆరోగ్య సంఘాల పోరాట కమిటీ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు సోమవారం పోరాట కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ జిల్లా డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ వెంకటిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న ఏఎన్‌ఎంలకు రెగ్యులరైజేషన్, కనీస వేతనాలు, ఇతర చట్టబద్ధ సౌకర్యాలు అమలు చేయాలన్నారు. దశాబ్దాల తరబడి దశలవారీగా సమస్యల పరిష్కారానికి ఆందోళనలు, పోరాటాలు, నిరవధిక సమ్మెలు చేశామన్నారు. సమ్మెల సందర్భంగా ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు అమలు కావడం లేదన్నారు. సర్వీసు వెయిటేజీ 50 మార్కులు ఇవ్వాలన్నారు. వయోపరిమితిని ఎత్తివేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు ఎ.కవిత, పి.లక్ష్మీబాయి, కిరణ్మయి, బి.సునీత, ఎం.సంతోషమ్మ, విజయ కుమారి, ప్రమీల, సత్యరాణి, సువర్ణ, ఆర్.కవిత, కుమారస్వామి, రమా, అమ్మాజీ, సులోచన ఉన్నారు.



దివ్యాంగులు ఆర్థికంగా ఎదగాలి

చాదర్‌ఘాట్: దివ్యాంగులు ఆర్థికంగా ఎదిగి సమాజంలో గుర్తింపు తెచ్చుకోవాలని వికలాంగుల సంక్షేమశాఖ రాష్ట్ర డైరెక్టర్ బి.శైలజ అన్నారు. మలక్‌పేటలోని వివిధ సంఘాల నాయకులు ఎన్‌పీడీఓ అధ్యక్షుడు రాజేందర్ ఆధ్వర్యంలో సోమవారం డైరెక్టర్ బి.శైలజను కలిసి సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగులమని కుంగిపోకుండా జీవితంలో ముందుకు వెళ్లాలని అన్నారు. ఆ దిశగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు వినియోగించుకోవాలని అన్నారు. అదేవిధంగా సమస్యలు ఉంటే తన దృష్టికి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో వికలాంగుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గడప ప్రతిష్ఠ పూజలు

చాదర్‌ఘాట్: ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ ధోబీగల్లీలోని శ్రీమహంకాళి దేవాలయంలో గడప ప్రతిష్ఠ పూజలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజల్లో సుదర్శన్ బాబు,బాబు శ్రీనివాస్, నర్సింగ్‌రావు, ఆగమయ్య, చాకి రవికుమార్, లక్ష్మణ్, వీరాస్వామి, రవికుమార్ పాల్గొన్నారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి

కాచిగూడ: ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి (70) మృతి చెందిన సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఈనెల 23వ తేదీన బర్కత్‌పుర చౌరస్తాలోని క్రౌన్‌కెఫ్ సమీపంలో ఫుట్‌పాత్‌పై సదరు వృద్ధుడు అనారోగ్యంతో పడి ఉన్నాడు. అతడిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రయాణికురాలి బ్యాగు చోరీ

జీరో ఎఫ్‌ఐఆర్ నమోదు

కాచిగూడ: రైలులో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికురాలి బ్యాగు చోరీకి గురైన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... మధురై – కాచిగూడ ప్రత్యేక రైలులో నాగరాణి (79) మధురై నుంచి కాచిగూడకు వస్తోంది. అనంతపురం వద్ద చూసుకునే సరికి బ్యాగు కనిపించలేదు. బ్యాగులో సెల్‌ఫోన్, రూ.10వేల నగదు, ఎస్‌బీఐ ఏటీఎం కార్డు ఉంది. సోమవారం కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేసింది. పోలీసులు జీరో ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం అనంతపురం రైల్వే పోలీస్‌స్టేషన్‌కు కేసును బదిలీ చేశారు.

వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలి



బీసీ కమిషన్ చైర్మన్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

చిక్కడపల్లి: అత్యంత వెనకబడిన వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలని వడ్డెర ఆత్మగౌరవ భవన సముదాయం ట్రస్ట్ తెలంగాణ చైర్మన్ జెరిపేటి సత్యనారాయణరాజు, వైస్‌చైర్మన్ ఎత్తరి అంతయ్య డిమాండ్ చేశారు. ట్రస్ట్ సభ్యులతో కలిసి సోమవారం వారు బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌ను కలసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ... అసెంబ్లీ తీర్మానం చేసి ఎస్టీ జాబితాలో వడ్డెరలను చేర్చాలన్నారు. క్వారీలపైన వడ్డెరులకు పూర్తి హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. మైనింగ్‌లో 20శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్లు డాక్టర్ ఓర్సు కృష్ణయ్య, శివారాత్రి అంజయ్య, రాములు, నాగరాజు, శీను తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను త్వరగా పూర్తిచేయాలి

ముషీరాబాద్: డివిజన్‌లోని బాపూజీనగర్ శివాలయం వీధిలో రూ.14లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులను సోమవారం ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... నిధులు మంజూరై పనులు చేపట్టకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అధికారులు వెంటనే పెండింగ్ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నామని... ప్రజలు సంపూర్ణ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్‌గౌడ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ, నాయకులు వెంకటేష్, బాలు, అపర్ణ, అనిత, స్నేహలత, కృష్ణయాదవ్, రాము, కోటేశ్వర్‌రావు, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.



బాపూజీనగర్‌లో సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



ఖోఖో విజేతలతో కార్పొరేటర్ జి.రచనశ్రీ

కవాడిగూడ: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని అప్పుడే మానసిక ఉల్లాసం లభిస్తుందని కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ అన్నారు. సోమవారం దోమలగూడ గగన్‌మహల్‌లోని ప్రభుత్వ వ్యాయామ కళాశాలలో జరిగిన ఖోఖో పోటీలను ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. పది జిల్లాల నుంచి దాదాపు 200ల మందికి పైగా ఖోఖో క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వారికి సహకరించాలని సూచించారు. అనంతరం ఖోఖో పోటీలలో విజేతలైన వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేత జి.వెంకటేష్, వ్యాయామ కళాశాల ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

30 శాతం వివాహితులు కుటుంబ హింస బాధితులే..

పీపీఏఐ అధ్యక్షురాలు డా. హిప్నో పద్మాకమలాకర్

కవాడిగూడ: అంతర్జాతీయ మహిళా హింసా నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఇందిరాపార్కులో నవభారత లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ప్రొగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు(పీపీఏఐ) అధ్యక్షురాలు డా. హిప్నో పద్మాకమలాకర్ హాజరై మాట్లాడారు. మహిళలపై జరుగుతున్న హింస, లైంగిక వేధింపులు వారి వ్యక్తిత్వాన్ని, ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం దాదాపు 30శాతం వివాహితులు కుటుంబ హింసా బాధితులేనని అన్నారు. ఇది కేవలం వ్యక్తుల సమస్య మాత్రమే కాకుండా సమాజానికే సవాలు అన్నారు. మహిళలకు సమానత్వాన్ని కల్పించి... వారి ఆలోచనలు, అభిప్రాయాలకు విలువను ఇచ్చి.. వారి హక్కులను పరిరక్షించడంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జ్యోతిరాజా, సుహాసిని, రాజ్యలక్ష్మి,డాక్టర్ విశాల, గీత, దివ్యా, అరుందతి, సత్యలక్ష్మి, రేణుక, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మహిళలతో మాట్లాడుతున్న డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్

గానసభలో కళాకారుల శ్రీకృష్ణ రాయబారం పద్యనాటక ప్రదర్శన



నటులు మల్లాది గోపాలకృష్ణను సన్మానిస్తున్న శ్రీహరిరావు, సాంబశివారెడ్డి



పద్యనాటకం.. నటన అద్భుతం

చిక్కడపల్లి: పురాకృతి దశమ వార్షికోత్సవాలు త్యాగరాయ గానసభలో సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రదర్శించిన పౌరాణిక పద్య నాటకాలు అలరించాయి. పాదుకా పట్టాభిషేకం, భక్త పోతన, శ్రీకృష్ణ రాయభారం ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అనంతరం జరిగిన సమావేశంలో కళాకారుడు ఉప్పలపాడు షేక్ సైదులుకు జీవన సాఫల్య పురస్కారం అందజేశారు. అదే విధంగా ప్రముఖ నటులు మల్లాది గోపాలకృష్ణ, ఇందిరాదేవికు ఆత్మీయ సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు శ్రీహరిరావు, సాంబశివారెడ్డి, షేక్‌లాల్ అహ్మద్, పొత్తూరు సుబ్బారావు, నాగేశ్వర్‌రావు, కళ్యాణ్, మల్లాది వెంకటరమణ, పుట్రేవు పరివారం తదితరులు పాల్గొన్నారు.